అపరాధ పరిశోధన

# దీపం తెచ్చి పెట్టిన మిస్టరీ!

టి. వి. శంకరమ్

"వొండ్రఫుల్! వొండ్రఫుల్!"

"ఏంటి, గురో?"

"భద్రం!"

"ఆఁ, గురో! వింటున్నాను, గురో!"

"కనిపెట్టేశాను!"

"అంతు దొరికిందా, గురో?"

"దొరికింది భద్రం!"

"చెప్పాకురండి, గురో!"

"ఈ పుస్తకాలు చూడు. ఒకటి, రెండు, మూడు, నాలుగు పుస్తకా లున్నాయి. అవునా?"

"సందేహమేంటి గురో?"

"నాలుగు అట్టలమీదా బొమ్మలున్నాయి. వాటిల్లో నీకేం కనిపిస్తున్నది భద్రం?"

"అమ్మాయిలు, గురో!"

"రవిట్!...వాళ్ళ మొహాలు చూసి నీకు ఏం తట్టుతున్నదీ చెప్పు!"

"రుమానీ మామిడిపళ్ళే, గురో?"

"భద్రం!"

"గురో?"

"నీది మట్టిబుర్ర! నీ వెంతసేపూ తిండియావా, సినీమాల్లో ఎగస్ట్రా వేషాల యావానూ!"

"దానికేంటిలే, గురో! నాలుకాలాల పాటు రుమానీపళ్లూ, అమ్మాయిలూ, సినీమాలూ ఉండాల్సిందేగా, గురో?"

"నీ కింతకూ అసలు విషయం తెలీలేదు."

"అలాగా, గురో?"

"ఈ నాలుగు బొమ్మల్లోనూ ఉన్నది ఒకే అమ్మాయి!"

"అది నాకు గమనానికి రాలేదు, గురో!"

"హాశ్చర్యం!"

"ఏంటి, గురో?"

"ఒక మిస్టరీ గురించి ఆలోచిస్తుంటే ఎంతసేపు పనిచెయ్యని బుర్ర ఉన్నట్టుండి పనిచేసి, మిస్టరీని విచ్చగొడుతుంది. మనకు కేసులు ఎందుకు రావటం లేదా అని ఎన్నాళ్ళనించో హాదే పనిగా ఆలోచిస్తున్నా. ఇప్పుడు తెలిసింది!"

"హాత్తెరీ! మిస్టరీకి కారణం ఏంటై వుంటుంది, గురో?"

"ఇదుగో, ఈ అమ్మాయే! ఇంతమంది డిటెక్టివులకూ ఈ అమ్మాయి ప్రియురాలు. నన్నడిగితే ఈ అమ్మాయి పేర్లు మార్చుకుని వీళ్ళందరిదగ్గరా ఉంటున్నది. అందుకనే వాళ్ళకి కేసులు నెలకు రెండూ మూడూ వస్తున్నాయి!"

"వహ్వారే గుళ్ళీ! కనక మనం ఇప్పుడేం చెయ్యాలి, గురో?"

నేను వెంటనే జవాబివ్వలేదు. ఈ రహస్యం నే నెవరికీ చెప్పలేదు—నాకు ఆడవాళ్ళంటే చెడ్డభయం. ఆ యిన్స్పెక్టరు వాసూ పాల్గి మొహంతోనే అమ్మాయిని వాటేసుకుని, ముద్దు పెట్టుకుంటాడు. చదువుతుంటే రముజుగానే ఉంటుంది కాని...మనవల్ల అయే పనిగాదు. అందుకే నేను సినీమాల కెళ్ళను కూడా. తెరమీద అమ్మాయి మొహం ఇంత పెద్దది కనిపిస్తే నాకు తాకుతున్నట్టే ఉంటుంది. అప్పు డదో రకంగా అవుతుంది. కాని కేసులు రావటానికి ఏం చెయ్యమన్నా చేస్తాను.

"భద్రం! ఆ అమ్మాయి మనకి పెద్ద క్లూ. ఎక్కడుంటుందో, మనకు సహాయపడకనంటదో, లేదో విచారించు."

"అదెంతపని, గురో? నువ్వు చూశావో లేదో, ఈ దగ్గరే బూలోక సొరగమని ఒక ఇల్లుంది, గురో. అందులో అయిదుగు రమ్మాయిలున్నారు గురో. వాళ్ళలో ఒకమ్మాయి ఒకవేళ ఈ అమ్మా

యల్లే ఉన్నదా అనిపిస్తుందా ఏమిటా అని నాకు కొంచెం అనుమానంగా ఉంది గురో."

"ఆ అమ్మాయికి డిటెక్టివ్ల స్నేహం ఉందా?"

"అది మనకి తెలీదు గురో! కాని ఓసారి ఆ బట్టతల ఇనస్పెక్టరును అనుకుని ఉండగా చూశా గురో!"

నాకంతా తెలిసిపోయింది! కేసుల్లో కలిసొస్తుందనే ఆ ఇనస్పెక్టరు ఆ అమ్మాయిని అనుకొనిస్తున్నాడు.

"భద్రం, ఆ అమ్మాయి మనల్ని కూడా అనుకుంటుందేమో తెలిస్తే బాగుణ్ణే!" అన్నాను.

"డబ్బు పారేస్తే నూచక్కగా అనుకుంటుంది, గురో!"

"డబ్బా?"

"అవును గురో, పాతిక రూపాయలు."

"పాతిక రూపాయలా? దేనికి?"

"అదేలే, గురో—కేసుకి పాతిక రూపాయలు."

"ఆ ఇనస్పెక్టరిస్తున్నాడంటావా?"

"ఆయన ఇనస్పెక్టరుగా, గురో?"

"మనం డిటెక్టివులంగా?"

"అదీ ఓ విధాన నిజమే ననుకోవల్సిందే ననుకోండి."

భద్రం ఎందుకో నీళ్ళు నమిలాడు.

"ఏమిటి, నీళ్ళు నములుతున్నావు?"

"లేదులే, గురో. ఆ భూలోక సారంగం కేసి పోతే అన్నీ తేల్చుకోవచ్చుగా?" అన్నాడు భద్రం.

"సరే, దారితియ్యి!" అన్నాను.

మేం భూలోక సారగానికి బెత్తెడు ఎడంలో ఉండగా లోపల్నుంచి గట్టిగా కేకలు వినిపించినయి. "నేనూ శానామంది మడుసుల్ని చూశా గాని యింత గోరకలి ఎక్కడా ఎరగను!... అయిదొందల్రూపాయలు ఎవరికీ తెలీకుండా ఎట్టా పోయినట్టూ? ఎవరు తీసినట్టూ?" అని బొంగురు గొంతు అరుస్తున్నది. ఆ తక్షణంలోనే ఒక నల్లటి, సన్నటి, పొడుగాంటి యువకుడు, లేచిన క్రాపూ, మల్లుపంచా, మల్లుషర్టూ సిల్కు కండువా వేసుకుని బయటికొచ్చాడు. మొహం రుసరుసలాడుతున్నది.

"సీనయ్యేమాయున్నాడా?" అని భద్రం ఆ అబ్బాయినడిగాడు.

"అంతా సచ్చారు!" అన్నాడు అబ్బాయి.

నా గుండె ఆగిపోయింది. "కత్తా? తాడా? సయినీడా?" అని అడిగాను. అబ్బాయి నాకేసి వాశ్చర్యంగా చూసి, భద్రంకేసి తిరిగి ప్రశ్నగా చూచాడు.

"ఏవూరేంటి?" అన్నాడు భద్రం అబ్బాయితో.

"మాది తంగేడుపల్లి లే. నా పేరు నారాయుడు. అంతా దీపం అని పిలుస్తారు. అదిగాదు నేననేది మడుసులికి నీతంటూ ఉండొద్దూ. నిన్న రేత్తిరి ఎగస్పెరెస్సుకు వచ్చా. పాతచోటే అవటా గదా అని వచ్చి పడుకున్నా. తెల్లవారి చూసుకున్నప్పుడు కూడా ఉంది. ఇంతకుముందు చూస్తే లేదు."

"అయిదొందలా?" అని అడిగాడు భద్రం.

"ఇంకో అయిదో పదో ఎక్కువే! తన చేతి కెందుకివ్వలేదంటాడు మావ. నిజమే ఇయ్యొచ్చు. ఎందుకో ఇవ్వలా! తెలిసినచోటే గదా అనుకున్నా! మనిషి నమ్మకం లేకపోతే ఇంకెట్టా?"

"ఎవరు తీశారంటాడూ?"

"ఎవళ్ళో వచ్చారంటాడు. కావలిస్తే ఇల్లంతా గాలించమంటాడు. పోలీసులకి రిపోర్టివ్వమంటాడు."

"చూడండి దీపంగారూ! మీరు తొందరబడి పోలీసుల్దాకా పోవద్దు. వాళ్లు అంతకుల్ని మా సహాయం లేకుండా ఎప్పుడూ పట్టుకోలేరు. నన్ను కేయూసంటారు. నాకు కాసిన్ని గంటలిచ్చారంటే మీ సొమ్ము కాజేసిన వాళ్ళని పట్టిస్తాను!" అన్నాను.

"ఆయనింకా కాఫీ, యిడ్లీ తాగినట్టులేదు. అట్లా హోటలుకేసి పోదామా ఏం?" అన్నాడు భద్రం.

"పదండి. కరుణులో కరుణా!" అన్నాడు దీపంగారు.

ముగ్గురం కలిసి మొగదల కాఫీ హోటలుకు పోయాం. నేను దీపంగారిని కేసు వివరాలడిగాను. ఆయన మొహం చిట్లించి, "ఎందుకొచ్చిందిలే? ఈ వారం డబ్బు వృధా ఖర్చవుతుందని మాస ఫలాల్లో రాయనే రాశాడు. అసలందుకే నా దగ్గిర డబ్బున్న సంగతి మావకి తెలియనివ్వలా. తెలిస్తే కరుణా పెట్టేయిస్తాడు ముసలినాకొడుకు!"

నాలో ఏదో కదిలి తన్నినట్టయింది.

"ఏమిటా సకలాలు, దీపంగారూ?" అని అడిగాను.

"మాసకలాలయ్యా! అదేదో పత్రికరాదూ? 'అంబుజం' పత్రికలో శేషాచార్లు రాస్తుంటాడే, అదీ! తేదీ వారం గడియంతో సహా రాశాడు నా కొడుకు...దూరప్రయాణం, స్త్రీసుఖం, వొళ్లు మాలిన డబ్బు కరుజు! చూసినట్టు రాశాడు, వాడి పీక తెగ్గొయ్య!"

"ఆహోహాం, హాత్యాశ్చర్యం! భద్రం రాసుకో! హాంబుజం, శేషాచార్లు...ఇన్ని కేసులు చదివా గాని, ముందుగానే క్లూలిచ్చిన నాకొడుకును ఎన్నడూ చూళ్ళా!... పైగా పత్రికలో హాచ్చేశాట్ట! భద్రం, వాడి గుండెలు జేంతో చేశారంటావు?"

"ఈ హోటల్లో ఇచ్చే పెప్పరువడతో చేసుంటారు గురో!"

"బాగా చెప్పావు ... ఈ హాంబుజం పత్రిక ఎక్కడుంటుంది?"

"బయట కిళ్ళీకొట్టులో ఉంది, గురో!"

"అది కాదురా, మట్టిబుర్రా! ... అది ఎక్కణ్ణుంచి విలవడుతుంది?"

"ఓ కాపీ కొనేస్తాం, గురో! అట్టమీద రవు జమున సినిమాస్టార్ బొమ్ముంది."

"సరే కొను."

కాఫీ తాగటం అయిపోగానే బయటికొచ్చి దీపంగారితో, "దీపంగారూ, మీ కేసు నాకు వొదిలిపెట్టండి. అంతకుడు దొరికితే గనక మిమ్మల్ని ట్రంకుచేస్తా" అన్నాను.

ఈ లోపల భద్రం హాంబుజం కొన్నాడు. అది విలవడే చోటు చదివి చెప్పమన్నాను. అది మాంబళంలో అదేదో తెరువులో ఉంది. చెట్టు పక్కనున్న ఆటోలోకి దూకి, భద్రాన్నికూడా దూకమన్నాను. దూకాడు.

"దూసుకుపో!" అన్నాను ఆటోవాడితో.

"ఎన్నా?" అన్నాడు వాడు.

"ఎన్నాలేదు, వెన్నాలేదు. మాంబళం దూసుకుపో!" అన్నాను. వాడు దూసుకుపోయాడు.

మేం తొందరపడ్డాం. హాంబుజం ఆఫీసు ఇంకా తెరవలేదు. తెరవలేదని భుజంమీద తువాలా వాడు చెప్పాడు, కాని తెరిచే ఉంది. అయితే హెడ్డీటర్ లేదు.

"హెడ్ ఎప్పుడొస్తాడు?" అని అడిగాను.

"ఎన్నంగే?" అన్నాడు తువాలావాడు ఇకిలిస్తూ.

ఇంతలో ఎవరో వచ్చారు.

"ఏమండీ, మీరేనా హెడ్డు?" అని అడిగాను.

"హెడ్డా?" ఆయన తెల్లబోవటం గమనించగలిగాను.

"హెడ్డీటరంటారే, ఆయనా!"

"నేను కాను. మీకేం కావాలి?"

"ఈ హాంబుజం పత్రిక్కి మాస ఫలాలు రాసే శేషాచార్లు హెడ్రస్సు కావాలి."

"ఆయన ట్రిప్లికేనులో వైజయంతీమాల వీధిలో ఉంటాడు."

మేం బయటికొచ్చి ఆటోలో దూకాం. ఆటోను ట్రిప్లికేను దూసుకుపొమ్మన్నాను. నే నెప్పుడు ట్రిప్లికేను వెళ్ళలేదు. మాంబళంనుంచి ఎగ్మూరు స్టేషను, సెంట్రలు స్టేషను, పారీస్ కార్నరు, బీచిలమీదిగా పోతే ట్రిప్లికేను వస్తుంది. కానా దూరం—పన్నెండుమైళ్ళు.

శేషాచార్లు ఇంటోనే ఉన్నాడు గాని పూజ చేస్తున్నాట్ట. ఓ గంట ఆగమన్నారు.

"భద్రం, పూజచేసేవాళ్ళు అంతకులవుతారా? అంటే నా ఉద్దేశం అంతకులు పూజచేస్తారా అని!" అన్నాను.

"అమ్మో! పూజచేసేది అంతకులే, గురో! డిటెక్టివులకు పూజే అక్కర్లేదు."

"అంతేనంటావా? ఐతే ఆటోను ఉండమను."

"వాడు మనవాడేలే, గురో!"

ఆచార్లు బయటికొచ్చేప్పటికి పదయింది.

"రండి, రండి! దయచెయ్యండి! ప్రశ్నలడగ వచ్చారా?"

'అమ్మ నా కొడకా' అనుకున్నాను. వాడి గుండెలు ఉక్కుతో చేశారు! మేమెవరో, ఎందుకొచ్చామో డిటెక్షన్ చేసేశాడు! పైగా నవ్వుతాడేం?

నేను ఆయనకేసి కఠినంగా కళ్ళల్లోకి చూస్తూ, "ఈ దెబ్బతో మీ అంతు కనుక్కుంటాను. నన్ను కేయాసంటారనేది మీరు మరిచిపోవద్దు. వీడు నా అసిస్టెంటు భద్రమన్నది కూడా గ్నాపకం ఉంచుకోండి. మీరు దీపంగారి నెరుగుదురా?"

"దీపం జ్యోతి పరబ్రహ్మ! ఎరక్కేం?"

"ఆయన డబ్బు ఈ ఉదయం పోతుందని మీ కెట్లా తెలిసింది?"

"చిత్తా నక్షత్రంలో పుట్టి ఉంటాడు. శని వక్రించాడుగాదూ, డబ్బు పోయితీరాలి. కించిత్తు నీచస్త్రీ సుఖంకూడా—"

"నేనిన్ని మాటలవాణ్ణి కాను. ఈ కేసుతో మీకుగల సంబంధం ఏమిటో విప్పి చెప్పెయ్యండి, దాచి లాభంలేదు."

ఆచార్లు పక్కనేఉన్న తోలు పెట్టెకేసి పరీక్షగా చూసి, "ఇందులో రహస్యమేంలేదే? ఇది మా అల్లుడిది. ప్రయాణాలకు ఉపయోగిస్తుంటాడు," అన్నాడు.

"అయితే దొంగతనం ఎవరు చేశారంటారు?"

"దొంగలే!"

"వాళ్ళ పేర్లు?"

"నేను పేర్లు ఎప్పుడూ చెప్పను. మనది నాడీ కాదు, కేరళం."

"పేర్లు బయట పెట్టరేం? ఇప్పుడు నమ్మను ట్రంకుచేస్తే ఏమవుతుందో తెలుసా?"

"ట్రస్సూ, బంకూ అవుతుంది."

ఇంతమంది అనుమానితులను గురించి చదివాను గాని ఈ ఆచార్లు చాలా మొండిగా కనబడ్డాడు. ఆయన మాట్లాడే దాన్లో నాకు సగంకూడా అర్థం కాలేదు.

"భద్రం, ఈయన పేర్లు చెప్పట్టే? మనం వెళ్ళి సర్కిల్‌ని పిలుచుకొద్దాం" అన్నాను. నేను భ్రమ పడినట్టు ఆచార్లు హడిలిపోలేదు.

"ఈ హోల్ పట్నంలో ఉండే పోలీసు ఆఫీసర్లంతా మనదగ్గిరికే కన్సల్ట్ కోసం వస్తూంటారు."

నాకంతా అర్థమయింది! ఈన ఒక పెద్ద డిటెక్టివయి ఉండాలి. లేకపోతే పోలీసాఫీసర్లు ఎందు కొస్తారు?

"తమకు శ్రమిచ్చినందుకు క్షమించాలి! మేం వెళ్ళొస్తాం," అన్నాను.

"ఫీజు నాలుగు రూపాయలవుతుంది. ఇచ్చి వెళ్ళండి," అన్నాడు ఆచార్లు.

"ఫీజా?" అన్నాను.

"అవును. మూడు ప్రశ్నలకు రెండు రూపాయలు."

"ఇది నేనెక్కడా చూడలేదే...మీరు ఏ పుస్తకంలో ఉన్నారు, సార్?"

"టెలిఫోన్ డైరెక్టరీలో."

"భద్రం. రాసుకో. ఆ పుస్తకం మనం చదవలేదు. అట్టమీద ఏం బొమ్మ, సార్?"

"ఏదో పెళ్ళివాళ్ళ గుంపు ఉంటుంది!"

"భద్రం. ఆయనకు నాలుగు రూపాయలిచ్చెయ్యి."

"నాలుగుకాదు, ఆరు. మళ్ళీ మూడు ప్రశ్నలడిగారు."

"ఎప్పుడు?"

"ఇప్పుడే!"

"మీరే పుస్తకంలో ఉంటారనా?"

"అదీ ఇంకో రెండు ప్రశ్నలూనూ!"

"వాటికూడా ఫీజా?"

"అవును, ఈమధ్య మా బంధువొకాయన వచ్చి 'ఖులాసాగా ఉంటున్నారా?' 'డబ్బు బాగా వస్తున్నదా?' 'వెళ్ళిరానా?' అని అడిగాడు. తరాయించి రెండు రూపాయలూ వసూలు చేశా!" అన్నాడు ఆచార్లు.

"గురో!" అని భద్రం పెడబొబ్బ పెట్టాడు.

"ఏంటి, భద్రం?"

"మీ రాయనతో ఒక్క అక్షరంకూడా మాట్లాడొద్దు బాబూ, ఇదుగో పదిరూపాయల నోటు రెండు రూపాయ లిప్పించండి," అన్నాడు భద్రం.

"చిల్లర లేదల్లే ఉంది. ఇంకో మూడు ప్రశ్నలడిగిపోరాదూ?"

భద్రం నన్ను చెయ్యి పట్టుకుని జరజరా బయటికీడ్చుకుపోయాడు. బయట కారు నిలబడిఉంది. అందులోంచి సూపరూ, చెవులకు రవ్వల కమ్మలు పెట్టుకుని సూపరు భార్యా దిగుతున్నారు.

ఇద్దరమూ ఆటోలోకి దూకి, దూసుకు పోమ్మన్నాం. మా ఖంగారులో ఆటోవాడు బీచిమీదిగా పోవటం మర్చిపోయి చుట్టు దారిన పోసాగాడు.

"భద్రం!" అన్నాను.

"ఏంగురో!"

"ఒప్పేశాను."

"ఏమని, గురో?"

"నేను ఓడిపోయాను! నాకు ఈ డిటెక్టివుపని ఏమీ చేతకాదు."

"అట్టా అనకండి, గురో. మీరు కూనీ అయి

పోతే మీ అసిస్టెంటుగా నేనూ కూనీఅయిపోతాను. నాలుక్కాలాలపాటు బతికుండాల్సినోళ్ళం!"

"ఈ ఆచార్లు మిష్టరీ నాకు తలా తోకా ఎందుకు తెలీకుండా ఉంది?"

"అందులో మిష్టరీఉంటేగదా, గురో? కొంతరు వీధిలో కూర్చుని అణాకు ఓ ప్రశ్న చెబితే, ఈ ఆచార్లు మేడలో కూచుని రెండు రూపాయలకి మూడుప్రశ్నలు చెబుతాడు. అంతే తేడా. వీనా కొడుక్కీ నిజం తెలీదు."

"మరి దీపంగారికి జరగబొయ్యేదంతా ఎట్టా చెప్పాడూ? ఆయన డిటెక్టివు కాకపోతే నూప రెందుకు వచ్చాడూ!"

"కేసు పనిమీదొచ్చే నూపరు పెళ్ళాన్ని తెస్తాడా, గురో?"

"అది పెళ్ళాముని ఎట్టా?...భద్రం!" అరిచాను.

"ఏంటి, గురో?" అన్నాడు భద్రం కంగారుగా.

"ఆ అట్టలమీది అమ్మాయి! అదే మొహం! సందేహాంలేదు!"

భద్రం నాకేసి మళ్ళా అసహ్యంగా చూశాడు. వాడట్టా చూడకుండాఉంటే బాగుణ్ణు!

భద్రం ఆటోవాడికేసి తిరిగా, "ముత్తా, దూసుకుపో!" అన్నాడు.

ఆలోచిస్తున్నాను! ఆలోచిస్తున్నకొద్దీ మిష్టరీ చిక్కబడుతున్నది!... ★

---

# బ్రదుకు కథ ★

బొమ్మకంటి శ్రీనివాసాచార్యులు

ఏ సుమమొ పూయ తుమ్మెద కేమి యొరుగు?
ఎవడొ వినకున్న కోకిల కేమి తరుగు?
మల్లియలొ, శరచ్చంద్రికా మధురిమంబొ-
ఏది భుజియించి బడుగు హరించుకొనును?

ఏ యణువొ ప్రేలి హరు డుద్భవింపనిమ్ము!
ప్రళయమే తాండవించి, విశ్వమును 'శూన్య
పృథుల కాలాహి కా టందనిమ్ము! కాలి
బుగ్గి యైన ప్రేమను మేన పులుముకొందు

పొగులుగాక కాలము తుది మొదలులేక
అకసమ్మంచు దరిగాన కదలుగాక
మరుగుగాక శోకఖనియౌ మంచుకొండ
ఏమి పోవును నవ కవి కేమి వచ్చు?

నే డవిద్య సెల్లెంద్ర పెండ్లి జరుగునట!
కామ మోహమ్ములకు-వృద్ధ కన్యకలకు!
వరు లెవరు? వశిష్ఠు లెవరు? వరుల కట్న
మెంత? ఎంతయో కొంత-నాకేల వంత?

మెరుపు బ్రతుకెంత?-చీకటిన్ మ్రింగివేయ?
గడుసుదన మురుమ నెవరు జడియువారు?
'మాయ' కడుపున సత్య మేమాడ్కి పుట్టు?
లేదు లోకాన సత్యతా శ్రీ రవంత!

నా ముఖము నా హృదయ దర్పణమున తోచి
నా తెలివి నా కవిత్వమ్మునను ఫలించు
నా తపమ్మిది మధ్యందినాతపమ్ము
వరకు పెరిగిన చాలు నా బ్రతుకు కథకు.